
# నేనోడి నీవే గెలిచి...



*ప్రణయ కుపిత యోర్ద్వయో*
*రప్యలీక సుప్తయోః మానవిజ్ఞయోః*
*నిశ్చల నిరుద్ధ నిశ్వాసదత్త*
*కర్ణయోః కోమల్లః*

***భావం:*** ప్రణయ కోపం కలవారూ, దొంగ నిద్రపోతున్నవారూ, కోపం చూపించడంలో నేర్పరులూ, కదల కుండా ఊపిరి బిగిపట్టి చెవి ఒగ్గి వింటున్నవారూ అయిన ఆ ఇద్దరిలో ఎవరు గెలిచారు?

విష్ణుశర్మ రాజాస్థానంలో లేఖకుడు. మంత్రి, సైన్యాధ్యక్ష, దండనాయకులకు వలె పెద్ద జీతం లేదు. చిన్న పెంకుటింట్లో, భార్య అవంతితో

సామాన్య జీవితం గడుపుతున్నాడు. అవంతి తక్కువ జీతంతోనే పొదుపుగా సంసారం గడిపేది.

ఒకనాడు సాయంత్రం పని పూర్తయ్యాక విష్ణుశర్మ ఇంటికి వచ్చాడు. అవంతి గుమ్మంలోనే ఎదుర్కొని, కాళ్ళు కడిగి, సేద తీర్చి లోపలకు తీసికెళ్ళింది. విష్ణుశర్మ ఆసనం మీద కూచున్నాక ఆమె వింజామరతో గాలి వీచ సాగింది.

విష్ణుశర్మ "విశేషాలేమిటి" అన్నాడు. అవంతి "అవధానిగారు గద్వాలనుంచి సరిగంచు చీరా, కన్నడ దేశం నుంచి వజ్రాల కమ్మలూ తెప్పించారు. ఆయన భార్య తెచ్చి చూపించింది బాగున్నాయి" అంది.

రాజకార్యం గురించి ఆలోచిస్తూ అన్యమనస్కంగా ఉన్న విష్ణుశర్మ " ఎవరో భార్యకు చీరలూ, నగలూ కొన్నారని చెప్పడమెందుకు? నేను కొనలేదని సూటిగానే చెప్పవచ్చును" అన్నాడు.

అవంతి వెంటనే "వేరే అర్థాలెందుకు ఊహిస్తారు? నేను విషయం చెప్పాను" అంది.

"అపార్థాలేమీ లేవు. నగలూ చీరలూ కొనలేని అసమర్థుణ్ణి"

మాటామాటా పెరిగాయి. విష్ణుశర్మ పడక గదిలోకి వెళ్ళి మంచానికి ఒక చివరి పడుకున్నాడు. అవంతి కూడా లోపలకు వెళ్ళి మంచం రెండో చివర పడుకుంది. భోజనాలైనా చెయ్యకుండా ఎడమొహం,పెడమొహంగా పడుకున్నారు.

అవంతి ఆలోచించసాగింది. "ఏదో మాటవరసకి చెప్తే అంత కోపమెందుకు? తెచ్చిన జీతంలోనే పొదుపుగా సంసారం చేస్తోంది. పొరుగింటి వారి దాసీ జనానికున్నపాటి చీరలు కూడా లేవు. అయినా తనేం మాట్లాడలేదు. ఇంట్లోనే ఉండే తనకి చీరలూ, నగలూ కన్నా విశేషాలేం తెలుస్తాయి? నన్ను అనరాని మాటలని, ఆయన అలిగి పడుకోవడమేమిటి?

క్షమాపణచెప్పే దాకా మాట్లాడకూడదు" అనుకుంది. నిద్రనటించ సాగింది. ఊపిరి బిగపట్టి భర్త తనకి క్షమాపణ ఎప్పుడు చెప్తాడా అని చెవి ఒగ్గి కదలకుండా పడుకుంది.

విష్ణుశర్మ ఆలోచించసాగాడు. "ఆడదానికి నెత్తిమీద నీళ్ళకుండ ఉంటుంది. ఏదో చీరలూ, నగలూ కావాలని సూటిగా అడుగు అన్నమాటను హాస్య చతురోక్తిగా తీసుకోవాలి. కానీ ఈ అలక ఏమిటి? ఆకలిగా ఉంది. అయినా తను వచ్చి క్షమాపణ కోరి భోజనానికి పిలిచేదాకా కదలకూడదు" అనుకుని నిద్ర నటిస్తూ, ఊపిరి బిగపట్టి, భార్య కదలిక శబ్దానికై చెవి ఒగ్గి కదలకుండా పడుకున్నాడు.

ఎడ మొహం, పెడ మొహంగా ఉన్న ఇద్దరూ ఎవరు ముందుగా క్షమాపణ చెప్తారా అన్నట్లున్నారు. ఎవరు ముందుగా లొంగిపోయారు? ఎవరు గెలిచారు?

ప్రణయం ప్రళయం కాకుంటే చాలుకదా.

ఎవరు జయించారని పాఠకులకు అన్పిస్తున్నది?

******